క్లుప్తంగా

మాఘ మాసం పవిత్రమైనది



పారశిల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంతం ప్రతినిధులు

నరసన్నపేట: మాఘ మాసం ఎంతో పవిత్రమైనదని, విష్ణువుకు అత్యంత ఇష్టమైనదని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధకులు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సుందరాపురం, పారశిల్లి, తెలగవలసల్లో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘ మాసంలో బుధవారానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఆ రోజు సముద్ర స్నానం చేయడం ఎంతో మంచిదన్నారు. శివ రాత్రి పండగ విశేషాలను ప్రజలకు వివరించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

దాతల సాయంతో రేకుల షెడ్ల ఆధునీకరణ



తాడివలసలో నూతనంగా నిర్మించిన రేకుల షెడ్లు

పొందూరు రూరల్: తాడివలస ఉన్నత పాఠశాలలో ఉన్న రెండు రేకుల షెడ్లను దాతల సహకారంతో ఆధునీకరించినట్లు హెచ్ఎం బల్ల కంటయ్య తెలిపారు. తాడివలస గ్రామానికి చెందిన తమ్మినైన సత్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సమకూర్చిన రూ.1.50 లక్షలతో వీటిని పునర్ నిర్మాణం చేపట్టినట్లు హెచ్ఎం తెలిపారు. గతంలో భోజనశాల నిర్మాణానికి, పాఠశాల మైదానం ఎత్తు చేయడానికి, మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేశారన్నారు. మంగళవారం తమ్మినైన సత్యనారాయణ కుటుంబీకులు పాఠశాలను సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



పాఠశాల ముందు ప్రహరీ నిర్మాణానికి తవ్విన పునాదులు

నరసన్నపేట: మండలంలో దాసరివానిపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన స్థలం ఆక్రమణలకు గురవుతుందని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు ముందున్న స్థలం ఆక్రమణ చేసి ప్రహరీ నిర్మాణానికి పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులో వివరించారు. గతంలో కూడా కొంత స్థలాన్ని ఆక్రమించుకోవడం జరిగిందని, ఇప్పుడు మరికొంత భాగాన్ని ఆక్రమించుకొని ప్రహరీ పనులు చేస్తున్నారని తెలిపారు. నిర్మాణ పనులు చేస్తున్న కింతలి దమయంతి మాట్లాడుతూ.. గతంలో పాఠశాలకు మా నాన్న స్థల వితరణ చేశారని, మిగిలిన భాగంలోనే నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఎంఈఓ శాంతారావు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్ఎస్ఏ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు: ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న సుకన్య సమృద్ధి పథకం అకౌంట్ (ఎస్ఎస్ఏ) ప్రారంభం స్పెషల్ డ్రైవ్‌ను ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పొందూరు సబ్ పోస్టు మాస్టర్ ఎన్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ పథకం 10 ఏళ్లలోపు ఆడపిల్లలకు వర్తిస్తుందన్నారు. కనీసం రూ.250 నుంచి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు కట్టేవిధంగా ఖాతాను ప్రారంభించుకోవచ్చునన్నారు. ఈ పథకంలో చేరినవారు 15 ఏళ్లపాటు ప్రతి నెలా నిర్దేశించుకున్న మొత్తాన్ని చెల్లించాలన్నారు. ప్రస్తుతం 8.2 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట: మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 2 రెండు గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు (ఒరిజినల్) తీసుకురావాలన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

పాతపట్నం: ఈ నెల 12న మండలంలోని బోరుభద్ర గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఉదయం పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రైతన్నకు డిజిటల్ గుర్తింపు



హిరమండలంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- అన్నదాతలందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్య
- ప్రత్యేక యాప్ ద్వారా నమోదు
- గుర్తింపు సంఖ్య లేకుంటే పథకాలు అందవు

హిరమండలం: రైతులకు డిజిటల్ గుర్తింపు సంఖ్య (విశిష్ట గుర్తింపు సంఖ్య) ఇచ్చే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుగా నమోదు చేసేకోవాలి. రైతు సేవా కేంద్రాలకు అందుబాటులో ఉండే రైతుల వద్దకు విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్లు వెళ్లి యాప్‌ల ద్వారా వివరాలు నమోదు చేస్తారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులకు అందవు. ప్రధానంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు కూడా అందవు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సలహాలకు కూడా దూరమవ్వాల్సి ఉంటుంది.

నమోదు ఇలా..

- రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్లి రైతు పేరు, గ్రామం, ఆధార్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ వివరాలు అందించాలి.
- నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు.
- రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేకపోతే, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి, ఓటీపీ చెప్పడం ద్వారా రైతుల వివరాలు నమోదు పూర్తి చేసుకోవచ్చు.

ఇలా భద్రపరుచుకోవాలి

యాప్ ద్వారా నమోదు చేసుకున్న తరువాత అందించే గుర్తింపు సంఖ్య మెసేజ్ రూపంలో రైతు ఫోన్‌కు వస్తోంది. ఆ నంబర్‌ను అతను ఫోన్‌లో భద్రపరుచుకోవడం, పాసు పుస్తకాలపై రాసి ఉంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. గుర్తింపు సంఖ్య మరచిపోతే రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాల అందించి తెలుసుకోవచ్చు.

నియోజకవర్గంలోని సాగుభూమి (హెక్టార్లు), రైతుల వివరాలు					
మండలం	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు	మెళియపుట్టి	ఎల్.ఎన్.పేట
సాగుభూమి	8,699	3,364	10,374	7,741	4,464
రైతులు	14,726	6,716	13,914	12,235	8,487

ఈ నెలాఖరు వరకు గడువు



రైతులందరూ ఈ నెల చివరిలోగా వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి. లేకుంటే ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారు. సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, హిరమండలం

దీపాలంకరణ



ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున లక్ష్మీదేవి అమ్మవారికి పంచామృత స్నానాలు చేపట్టారు. సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణరాజు, వెంకటరాజు, వి.రాజేంద్ర, వికాస తరంగణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– ఆమదాలవలస

నూతన సొసైటీలకు అనుమతి

- ఫార్మర్ ఆల్ ఇండియా హ్యాండ్‌ల్యూమ్ బోర్డ్ మెంబర్ చంద్రయ్య



పాతపట్నం: నూతన చేనేత సొసైటీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఒకే గ్రామంలో రెండు సొసైటీలు పెట్టుకోవచ్చునని ఫార్మర్ ఆల్ ఇండియా హ్యాండ్‌ల్యూమ్ బోర్డ్ మెంబర్ మంచు చంద్రయ్య అన్నారు. మంగళవారం పాతపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. కొరసవాడలో ఉన్న సొసైటీకి నిఖర ఆస్తులు రూ.రెండు కోట్ల పైగా ఉన్నాయన్నారు. సొసైటీకి 30 సెంట్లు ఉందని, ప్రస్తుతం దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.76 లక్షలు ఉంటుందన్నారు. సొసైటీ కార్యాలయ భవనం రూ.కోటి విలువ చేసుందని, పాత భవనం కూడా ఉందని, ప్రభుత్వం కట్టించి భవనం విలువ రూ.43 లక్షలు ఉంటుందన్నారు. ఈ సొసైటీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రూ.96 లక్షలు ఉంటాయన్నారు. కేంద్ర సహకార బ్యాంకు ఇవ్వాల్సిన మొత్తం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్య ఉంటుందన్నారు. ఈ లెక్క ప్రకారం ఒక సభ్యుని షేర్ విలువ రూ.2 లక్షల పైగా ఉంటుందన్నారు. ప్రస్తుతం సభ్యత్వం లేని వారితో నూతన సొసైటీకి రిజిస్ట్రేషన్ చేయించి, సహకార సంఘంలోని వచ్చిన లాభాలను కార్మికులకు అందించవచ్చునన్నారు. కేవలం అనైక్యతతోనే సభ్యులను, శ్రామికులను రెండు భాగాలుగా కొంతమంది స్వార్థపరులు విడదీశారన్నారు.

పేరుకుపోయిన గుర్రపుడెక్క



సారవకోట మండలంలోని అక్కివలస, కోడద్దపనస గ్రామాలకు సమీపంలో వంశధార ఎడమ కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోయింది. కోడద్దపనస గ్రామానికి సమీపంలో ప్రధాన కాలువ నుంచి వెళ్లే చిన్న కాలువలో గుర్రపుడెక్క నిలిచిపోయింది. దిగువకు నీరు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

– సారవకోట

వినతి



సారవకోట మండలం గుమ్మపాడు పంచాయతీలో గల పలు విద్యుత్ సమస్యలపై ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈకి మాజీ సర్పంచ్ కత్తిరి వెంకటరమణ సోమవారం రాత్రి వినతిపత్రం అందించారు. అక్కివలస బ్రిడ్జి దగ్గర రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభం అడ్డుగా ఉందని, దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. గుమ్మపాడు గ్రామానికి త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలన్నారు. అశోకం గ్రామానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు.

– సారవకోట

అవస్థలు



మెళియాపుట్టి మండలంలోని మర్రిపాడు 'సి' పంచాయతీ పరిధిలో గల జలకలింగుపురం రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న వీధిలో మురుగు కాలువలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ యంత్రాంగం దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

ముమ్మరంగా..



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని వసుంధర గ్రామంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు. మండల వ్యాప్తంగా 250 ఎకరాల్లో వేసవి వరి (రబీ) పంట పండిస్తున్నారు. నాట్లు వేసే పనిలో మహిళలు బిజీ.. బిజీగా ఉన్నారు. మండల వ్యాప్తంగా వసుంధర, కొసమాల, మెళియాపుట్టి, మర్రిపాడు–'సి', నీలాపురం, కరజాడ, చాపర, మాకనాపల్లి తదితర గ్రామాల్లో వరి పంట పండిస్తున్నారు. ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా, షుగర్ లెస్) ధాన్యాన్ని పండిస్తున్నట్లు ఏఓ ధానకర్ణుడు తెలిపారు. పలుచోట్ల నీటిసదుపాయంలేక మహేంద్రతనయ నదిలో నుంచి ఇంజిన్ల ద్వారా పొలాలకు నీటిని మళ్లిస్తున్నారు.

– మెళియాపుట్టి

కలప అక్రమ రవాణా

- గ్రామాల నుంచి షా మిల్లులకు తరలింపు
- చోద్యం చూస్తున్న అటవీ శాఖాధికారులు
- వాహనాలు పట్టుకున్న అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు



టేకు కర్రలు తరలించేందుకు వ్యాపారస్తుడు వినియోగిస్తున్న నంబర్ ప్లేటు లేని వాహనం



టేకు కర్రలు తరలిస్తున్న వాహనం పాడై పోవడంతో వేరే వాహనంలోకి ఎక్కిస్తున్న వాహనదారులు

సారవకోట: మండలంలోని పలు గ్రామాలతో పాటు పాతపట్నం, హిరమండలంలోని పలు గ్రామాల నుంచి సారవకోట మీదుగా జలుమూరు, సారవకోట మండలాల్లోని షా మిల్లులకు గుట్టు చప్పుడుకాకుండా కలప తరలిస్తున్నారు. సారవకోట మండలంలోని బెజ్జి, అన్నుపురం, చిన్నగుజ్జువాడ, నౌతళ, మాళువ, తదితర గ్రామాల్లో టేకు కలప విస్తృతంగా ఉంది. ఎటువంటి అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి దుంగలుగా చేసి వీటిని ఎటువంటి నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో తరలిస్తున్నారు. టేకు కలపతో వెళ్లే వాహనాలపై నల్లని టార్పాలిన్‌తో కప్పుతున్నారు. చూసే వాళ్లకి ఎటువంటి అనుమానం రాకుండా వాహనాల్లో తరలిస్తుంటారు. సారవకోట మండలంలోని బెజ్జి, వాండ్రాయి, చిన్నగుజ్జువాడ తదితర గ్రామాల నుంచి టేకు కలపతో వచ్చే వాహనాలు పోలీస్ స్టేషన్‌ను దాటుకుంటూ రావాలి, కానీ పోలీసుల కంట పడకుండా జిల్లా పరిషత్ ఉన్నత పక్కనుంచి వెళ్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించే పరిస్థితి కన్పించడం లేదు సరికదా.. కలపతో వాహనాలను పట్టుకున్నా వారికి రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో వారికి తలొగ్గాల్సి వస్తుంది. మండల కేంద్రం మీదుగా ప్రతీరోజూ 5 నుంచి 8 వాహనాల్లో రాత్రీ, పగలూ తేడా లేకుండా టేకు కలప అక్రమ రవాణా జరుగుతూనే ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దేవదాయ భూముల సర్వే



సర్వే చేస్తున్న దేవదాయశాఖ, రెవెన్యూ అధికారులు

పొందూరు: స్థానిక సిస్టం కళాశాల సమీపంలో దేవదాయశాఖ భూములను మంగళవారం దేవదాయశాఖ, రెవెన్యూ శాఖ సర్వే అధికారుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. సంబంధిత భూములను ఆక్రమించుకుని పలువురు అక్రమ కట్టడాలు నిర్మించారని, వాటిని తక్షణమే కూల్చివేయాలని పొందూరుకు చెందిన అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించారు. సర్వే పూర్తికాకపోవడంతో మరో రోజు నిర్వహించాల్సి ఉందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ప్రసాద్‌బాబు, వెంకటరమణ, ఈఓ శ్యామలరావు, సర్వేయర్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకు మద్దతివ్వండి

ఎల్.ఎన్.పేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న ఉద్యమ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.మదన్‌మోహన్ కోరారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, రావిచెంద్రి, కొమ్మువలస, పూశాం, కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు.

6 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

సారవకోట: మండలంలోని వాండ్రాయి గ్రామానికి చెందిన చంద్రమౌళిని 6 మద్యం సీసాలతో పట్టుకుని అరెస్టు చేసినట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. గ్రామంలో మంగళవారం దాడి చేయగా.. చంద్రమౌళి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఎక్సైజ్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 14405 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు.

రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య



నరసన్నపేట: కంబకాయలో మాట్లాడుతున్న ఏఓ సునీత

పాతపట్నం: భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రవికుమార్ మంగళవారం తెలిపారు. గుర్తింపు సంఖ్య ద్వారా రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదృకంగా మరింత అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపునిస్తుందన్నారు. అదే విధంగా భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలు, వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందేందుకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు, వన్ బీ, ఆధార్ జిరాక్సు, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

గుర్తింపు నంబర్ తీసుకోవాలి

నరసన్నపేట: ప్రతి రైతుకీ కేంద్ర ప్రభుత్వం ఒక గుర్తింపు నంబర్ ఇస్తుందని, దీనిని రైతులందరూ వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని కంబకాయ, కరగాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు గుర్తింపు కార్డుల ప్రాధాన్యతను వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వీఏఏల వద్దకు వెళ్లి నంబర్‌ను పొందాలన్నారు. రబీలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వెంకటాపురం కాలనీ కూడలి వద్ద కోతకు గురైన రోడ్డు

కొత్తూరు: మండలంలోని వసప–మెట్టూరు రోడ్డు వెంకటాపురం కాలనీ కూడలి చెరువు వద్ద కోతకు గురైంది. ఈ ప్రాంతంలో మలుపు ఉంది. రోడ్డు ప్రతీ ఏడాది కోతకు గురవుతుంది. ప్రస్తుతం కోతకు గురైన ప్రాంతం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ ప్రాంతం వాహదారులకు కనిపించడం లేదు. ఇటీవల రోడ్డు మరమ్మతులు చేసినప్పటికీ.. కోతకు గురైన ప్రాంతాన్ని బాగుచేయక పోవడం గమనార్హం. రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిజిటల్ ఎల్ టు సురేష్ అన్నారు. పట్టణంలోని ఏపీఎం కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

చిరంజీవి మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో వచ్చిన కూరగాయలు, బెల్లం విక్రయించడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ప్రతీ మంగళవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మండల కేంద్రం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

65 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హిరమండలం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా 65 మంది గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8 మంది హైరిస్కుగా గుర్తించారు. జెమ్స్ ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్ట్ కె.దివ్య, రేడియాలజిస్ట్ రమ్య ఆరోగ్య పరీక్షలు, స్కాన్‌లు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అవసరమైన వారందరకీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు పాతపట్నానికి చెందిన డాక్టర్ గణపతిరావు సాత్యసాయి సేవా సంస్థల ద్వారా భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

57 మద్యం కేసులు నమోదు

ఆమదాలవలస: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2024 అక్టోబర్ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 57 మద్యం కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ జి.సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 57 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 80.13 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐదు నాటు సారా కేసుల్లో 31 లీటర్ల సారా స్వాధీనం చేశామన్నారు. 85 మంది పాత నాటుసారా నేరస్తులు, బెల్టు దుకాణాల నేరస్తులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఆమదాలవలసల పరిధిలో గల మద్యం వినియోగదారుల నుంచి క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా సర్వేలను సేకరించడం జరిగిందన్నారు. నాటు సారా వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు.

అందుబాటులో అత్యవసర ఔషధం

పాతపట్నం/కొత్తూరు: గుండెపోటు వచ్చిన రోగులకు అత్యవసరంగా ఇవ్వాల్సిన స్టెమీ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని పాతపట్నం, కొత్తూరు సీహెచ్‌సీల సూపరింటెండెంట్లు ఎస్.కృష్ణారావు, ధర్మాన కిశోర్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గుండెపోటుకు గురైన వెంటనే రూ.45 వేల విలువ చేసే ఇంజక్షన్ కోసం సీహెచ్‌సీలను సంప్రదించాలన్నారు. గుండెపోటుకు గురైనవారు మొదటి గంటలో 108కు ఫోన్ చేసి దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

నాణ్యత తప్పనిసరి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఎంఈఓ శాంతారావు అన్నారు. మండలంలోని రెడ్డికిపేటలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయిని జ్యోతితోపాటు వంట ఏజెన్సీ మహిళలకు తగిన సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.